E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 29-08-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ e-kaburu.com



హైడ్రాను అభినందించిన హైకోర్టు » 2లో

# యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



- వరదలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులను పునరుద్ధరించాలి
- అందుకోసం వెంటనే అంచనాలు తయారు చేయండి
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మెదక్, కామారెడ్డి జిల్లాల వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- వరదలపై హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష




ఈకబురు: హైదరాబాద్/పెద్దపల్లి/మెదక్‌జోన్: భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తక్షణ మే అంచనాలు తయారు చేసి అత్యవసర నిధులతో పనులు చేపట్టాలని సూచించారు. వరదల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వరదలతో అతలాకుతలమైన కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. భారీ వర్షాలతో బుధ, గురువారాల్లో పోటెత్తిన వరదలతో కామారెడ్డి, మెదక్ జిల్లాలో అపార నష్టం వాటిల్లిందని సీఎంకు రెండు జిల్లాల కలెక్టర్లు నివేదించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద హెలికాప్టర్ దిగి వరదల పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులను ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలో హెలికాప్టర్ దిగి జిల్లా కలెక్టర్‌తో సమీక్షించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవటంతో సాధ్యం కాలేదు. దీంతో మెదక్ జిల్లా చేరుకుని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హెలికాప్టర్‌ను మెదక్ ఎస్పీ కార్యాలయంలో దించి జిల్లాలో వరదల పరిస్థితిపై అక్కడే సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరద పరిస్థితిని కలెక్టర్ సీఎంకు నివేదించారు. వరద సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం బాగా పని చేసిందని సీఎం కితాబిచ్చారు. సమీక్షలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. మెదక్ నుంచే సీఎం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వరద పరిస్థితులపై ఆరా తీశారు. సత్వరం సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తరువాయి 2లో

# జల విలయం

తరువాయి 2లో



- కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి..
- అర్గొండలో 43.35 సెం.మీ అత్యధిక వర్షపాతం
- 11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా నమోదు
- భారీ వర్షాలతో మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాలు అతలాకుతలం
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు.. అలుగు పారుతున్న చెరువులు
- వరదలు, వర్షాలతో ముగ్గురు మృతి, ఆరుగురు గల్లంతు
- జల దిగ్బంధంలో గ్రామాలు.. వందలాది మందిని కాపాడిన సహాయక బృందాలు
- రహదారులను ముంచెత్తిన భారీ వరద.. ముంపులో జాతీయ రహదారులు
- కశ్మీర్ టు కన్యాకుమారి ఎన్‌హెచ్ 44కు కోతలు..రాకపోకలకు అంతరాయం
- పలుచోట్ల కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్‌లు.. నిలిచిపోయిన రైళ్లు
- అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష; ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- సహాయక చర్యల్లో కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్ నేతలు

ఈకబురు: ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా కురిసిన కుంభవృష్టి కామారెడ్డి జిల్లాలో బీభత్సం సృష్టించింది. జల ప్రళయాన్ని తలపిస్తూ.. బుధవారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం అర్గొండలో 24 గంటల్లో 43.35 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. 2023 జూలైలో ములుగు జిల్లా వెంకటాపూర్‌లో కురిసిన 64.9 సెంటీమీటర్ల తర్వాత ఇదే అత్యధిక వర్షపాతం కావడం గమనార్హం. అటు మెదక్, నిర్మల్ జిల్లాలను కూడా వాన ముంచెత్తింది. సిద్దిపేట, సిరిసిల్ల, ములుగు, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలను సైతం భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. కన్యాకుమారి - కశ్మీర్ నేషనల్ హైవే 44 సహా పలుచోట్ల ప్రధాన రహదారులు కోతకు గురికావడం, అనేకచోట్ల వంతెనలు, కాజ్‌వే లు కొట్టుకు పోవడంతో పట్టణాలు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వందేళ్ల చరిత్ర కలిగిన పోచారం ప్రాజెక్టును వరద ముంచెత్తగా డ్యామ్‌కు ఒకవైపు గుంత పడటంతో ఒక దశలో ప్రాజెక్టు తెగిపోతుందేమోనన్న భయాందోళనలు వ్యక్తం అయ్యాయి. ముందుజాగ్రత్తగా మూడు గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. మరోవైపు ఎన్నడూ లేనివిధంగా ఎగువ మానేరు ఉగ్రరూపం దాల్చింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి.



రైల్వే ట్రాక్‌లు సైతం కోతకు గురి కావడంతో పట్టాలు వరదలో తేలుతున్నట్టుగా కన్పించాయి. వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు మరణించగా, ఆరుగురు గల్లంతయ్యారు. రాష్ట్రంలో వర్షాలు వరదల పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఏరియల్ సర్వే ద్వారా ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

**కామారెడ్డి కకావికలం**

కుండపోతగా కురిసిన వర్షంతో కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. కామారెడ్డి పట్టణం చిగురుటాకులా వణికిపోయింది. కాలనీల్లో ఇళ్లు నీట మునిగాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 24 గంటల్లో జిల్లాలోని 11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. వేలాది మంది వరద ముంపుబారిన పడ్డారు.

జాతీయ రహదారులతో పాటు జిల్లా రహదారులు, గ్రామీణ రహదారులు, వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఒకరు గల్లంతయ్యారు. రాజంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గోడ కూలి ఇప్పకాయల పల్లె దవాఖాన వైద్యుడు వినయ్ (28) ప్రాణాలు కోల్పోయాడు.



## ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలం



- బస్తర్‌లో 8 మంది మృతి
- వైష్ణోదేవి యాత్రపై తర్జన భర్జన

» 2లో

## సింధు సంచలనం

» 6లో



## బరువు తగ్గిన కాజల్.. మెచ్చుకున్న వారిపై ఫైర్

» 5లో



## అమెరికా 50% సుంకాలు అమల్లోకి వచ్చాయ్

» 4లో




## భారత్ కెనడా సంబంధాల్లో పురోగతి.. దౌత్యవేత్తల పునర్నియామకం




తరువాయి 2లో



## కేటీఆర్, బండి సంజయ్ ఆప్యాయ పలకరింపు

ఈ-కబురు, :కేంద్ర మంత్రి బండి సంజయ్ మధ్య మాటల యుద్ధం అనునిత్యం కొనసాగుతూనే ఉంటుంది. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించడం, రాజకీయ వేదికలపై ఘాటు విమర్శలు చేసుకోవడం సర్వ సాధారణం.

» 2లో

## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే..ఎన్డీయేకు 324 సీట్లు

- ఇండీ కూటమికి 208 మాత్రమే
- ఇండియా టుడేసీ ఓటర్ సర్వే
- బిహార్‌లో ఎన్డీయేదే విజయం
- టైమ్స్ నౌ జేవీసీ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు 324 సీట్లు వస్తాయని ఇండియా టుడేసీ ఓటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే అంచనా వేసింది. ఇందులో బీజేపీ 260 స్థానాలు సాధిస్తుందని పేర్కొంది. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కంటే బీజేపీకి స్థానాలు పెరిగినా... వచ్చేసారీ సొంతంగా ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన బలం (272) దక్కదని తెలిపింది. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండీ కూటమికి 208 సీట్లు మాత్రమే లభిస్తాయని పేర్కొంది. గత ఎన్నికల్లో మొత్తం 543కు బీజేపీ కేవలం 240 స్థానాలే గెలుచుకుంది. ఇది సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన 272 స్థానాల కంటే 32 తక్కువ. అయితే భాగస్వామ్య పక్షాలతో కలిపితే ఎన్డీయేకు 293 స్థానాలు వచ్చాయి. ఇండి కూటమి 234 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాలతో ఎన్డీయే పుంజుకున్నట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేను జూలై 1, ఆగస్టు 14 మధ్య నిర్వహించారు. అన్ని లోక్‌సభ స్థానాల్లోని 54,788 మంది అభిప్రాయాలను సేకరించారు.

తరువాయి 2లో

## నేను బతికుండగా... ప్రజల ఓటుహక్కును హరించనీయను

» 3లో



ఈ-కబురు, :కోల్‌కతా: తాను బతికున్నంత వరకూ ప్రజల ఓటు హక్కును ఎవరూ హరించకుండా చూస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం స్పష్టం చేశారు. బెంగాలీలలో భాషాపరమైన భయాన్ని భాజపా ప్రేరేపిస్తోందని ఆమె ఆరోపించారు. కోల్‌కతాలో జరిగిన టీఎంసీ విద్యార్థి విభాగం ర్యాలీలో మమత పాల్గొని ప్రసంగించారు.



## వాటర్ ప్యూరిఫయర్స్‌పై జీఎస్టీ తగ్గించండి: ఆర్థికశాఖకు వినతి

» 4లో

మొదటి పేజీ తరువాయి

# యుద్ధప్రాతిపదికన మరమ్మతులు





వినాయక మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో భక్తులకు ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఆస్పత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవడంతోపాటు అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌బృందాల సాయం తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు.

మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యం

మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యంలా రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఎన్నో లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గురువారం పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని, ఏనాడో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే ప్రస్తుతం తెలంగాణకు వరప్రదాయినిగా మారిందని అన్నారు. మామ, అల్లుడు కాళేశ్వరం ప్రాజెక్టును గొప్పగా నిర్మించామని చెప్పుకుంటున్నారని, వాళ్లలా తాము 80 వేల పుస్తకాలు చదవలేదని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై సెటైర్ వేశారు. యూరియాపై ఎప్పటికప్పుడు బఫర్ స్టాక్ డిస్‌ప్లే చేస్తున్నామని సీఎం తెలిపారు. తదుపరి పంటలకు సైతం కొందరు రైతులు యూరియాను నిల్వ చేసుకోవడంతో కొరత ఏర్పడిందని చెప్పారు. సీఎం వెంట మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. ఎన్డీయేకు 324 సీట్లు



గత ఎన్నికల్లో మొత్తం 543కు బీజేపీ కేవలం 240 స్థానాలే గెలుచుకుంది. ఇది సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన 272 స్థానాల కంటే 32 తక్కువ. అయితే భాగస్వామ్య పక్షాలతో కలిపితే ఎన్డీయేకు 293 స్థానాలు వచ్చాయి. ఇండి కూటమి 234 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాలతో ఎన్డీయే పుంజుకున్నట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేను జూలై 1, ఆగస్టు 14 మధ్య నిర్వహించారు. అన్ని లోక్‌సభ స్థానాల్లోని 54,788 మంది అభిప్రాయాలను సేకరించారు. ఇంకోవైపు.. త్వరలో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం తథ్యమని టైమ్స్ నౌ-జేవీసీ సర్వే అంచనా వేసింది. మొత్తం 243 స్థానాలకు ఎన్డీయే 136 స్థానాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాగఠ్‌బంధన్ 75 స్థానాలకే పరిమితమవుతుందని తెలిపింది. ఆర్జేడీ 52, కాంగ్రెస్ 10 స్థానాలకు పరిమితమవుతాయని సర్వే అంచనా వేసింది. గత ఎన్నికలతో పోలిస్తే ఆర్జేడీకి 23, కాంగ్రెస్‌కు 9 సీట్లు తగ్గుతాయని పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

# జల విలయం



బుధవారం పొలం వద్దకు వెళ్లిన బీబీపేట మండలం జనగామకు చెందిన రైతు రాజిరెడ్డి (63) ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యాడు. గురువారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. బీబీ పేట మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన బాలరాజు వరదలో గల్లంతవగా ఆయన ఆచూకీ దొరకలేదు. జిల్లాలోని బీబీ పేట చెరువుకు గండిపడింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు ఎన్డీఆర్ఎఫ్, ఆరు ఎస్డీఆర్ఎస్ బృందాలు 25 చోట్ల రెస్క్యూ చేసి 775 మందిని కాపాడారు.

మెతుకుసీమ అతలాకుతలం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెతుకుసీమ కకావికలమైంది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ముఖ్యంగా హవేళీ ఘన్‌పూర్ మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. మెదక్ నుంచి రాజుపేట వైపు వెళ్తున్న ఓ ఆటో గంగమ్మ వాగులో కొట్టుకుపోవడంతో ఇందులో ప్రయాణిస్తున్న రాజుపేటకు చెందిన బెస్త సత్యనారాయణ మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన యాదగౌడ్ ఆచూకీ ఇంకా లభించలేదు. వాస్తవానికి వీరిద్దరు వాగులో ఉన్న ఓ చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయితే వరద ఉధృతికి వీరు కొట్టుకుపోయారు. మరోవైపు ఇదే మండలంలోని నక్కవాగులో ఓ కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న నరేందర్‌గౌడ్ ఓ పొదను పట్టుకుని 100కు ఫోన్ ద్వారా లొకేషన్ పంపడంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. గంగమ్మ వాగుపై రాజుపేట బ్రిడ్జిపై 8 మంది చిక్కుకుపోగా, వీరిని కూడా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. దూప్‌సింగ్ తండాను వరద నీరు ముంచెత్తింది. నిజాంపేట మండలం చల్మెడలోని సోమయ్య చెరువు, బ్రాహ్మణ చెరువు నిండిపోయి గ్రామాలను ముంచెత్తే ప్రమాదం ఉండటంతో చెరువు కట్టకు గండి పెట్టి నీటిని దిగువకు వదిలేశారు. కొల్చారం మండలంలోని తుక్కాపూర్‌లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లిన టేక్మాల్ మల్లప్ప భార్య ప్రమీల మంజీర నదిలో గల్లంతయ్యింది. గురువారం మధ్యాహ్నం వరకు అందిన వివరాల ప్రకారం..జిల్లాలో 49 రోడ్లు తెగిపోయాయి. 24 కాజ్‌వేలు, కల్వర్టులు కూలిపోయాయి. 21 బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. 22 చెరువులకు గండ్లు పడ్డాయి. మెదక్, రామాయంపేట పట్టణాలతో పాటు, పలు గ్రామాల్లో 20 కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. 6,341 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

జలదిగ్బంధంలో రామాయంపేట

రామాయంపేటలో రెండురోజుల్లో 20 సెం.మీ వరకు వర్షం కురిసింది. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, అక్కలగల్లి, బీసీ కాలనీ ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రామాయంపేట - కామారెడ్డి- సిద్దిపేట మార్గంలో వరద నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్సీ మహిళా డిగ్రీ కాలేజీ హాస్టల్లో నీరు చేరడంతో 50 మంది విద్యార్థినులను తాళ్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు.

రైతులు, ఇటుక బట్టీ కార్మికుల రెస్క్యూ

మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న భారీవర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు బుధవారం వరద పోటెత్తింది. రికార్డు స్థాయిలో వచ్చిన నీటితో మానేరు పరవళ్లు తొక్కుతోంది. దిగువన ఉన్న పరీవాహక వాగులో ఒక రైతు గల్లంతు కాగా.. ఐదుగురు రైతులు, ఇద్దరు ఇటుక బట్టీ కార్మికులు ప్రవాహంలో చిక్కుకున్నారు. గురువారం భారత వైమానిక దళ హెలికాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

గేదెల కోసం వెళ్లిన గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య అనే రైతు వరదలో గల్లంతయ్యాడు. నర్మాలకు చెందిన పలువురు రైతులు పశువులను తోలుకెళ్లి వాగులో చిక్కుకుపోయారు. అదే ప్రాంతంలో ఉన్న ఇటుకబట్టీలో పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరు కార్మికులు అక్కడే ఉండిపోయారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీ గీతే వరదలో చిక్కుకుపోయిన వారికి డ్రోన్‌ల ద్వారా ఆహార పదార్థాలు పంపించారు.

బండి సంజయ్ చొరవ

కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను ఒడ్డుకు చేర్చారు. గురువారం సంఘటన స్థలానికి చేరుకున్న సంజయ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఎగువ మానేరుకు వచ్చి వరద ఉధృతిని పరిశీలించారు.

మధ్యాహ్నం ఆర్మీ హెలీకాప్టర్లు బాధితులను రక్షించేంత వరకు ఆయన ఘటనాస్థలంలోనే ఉండటం గమనార్హం. కాగా వరదలో గల్లంతైన నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య నివాసానికి సంజయ్ వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. నాగం కుమారుడు సాయికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

నీటమునిగిన నిర్మల్

నిర్మల్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు భారీ నుంచి అతిభారీ వర్షం కురిసింది. నిర్మల్ పట్టణంలో పలు కాలనీలు నీటమునిగాయి. జిల్లాలోని లక్ష్మణచాంద మండలంలో మునిపల్లి శివారులోని గోదావరి కుర్రులో చిక్కుకుపోయిన పశువుల కాపరి శంకర్‌ను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామం వద్ద రోడ్డు మీదుగా ఉధృతంగా వరద నీరు ప్రవహించడంతో సుమారు 24 గంటల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

తెగిన ఎన్‌హెచ్- 44..

కశ్మీర్ టూ కన్యాకుమారి ఎన్‌హెచ్-44 పై పలుచోట్ల రోడ్డు, వంతెనలు తెగిపోవడంతో జాతీయ రహదారిపై బుధ, గురువారాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ జిల్లా నార్సింగి వద్ద వరద 44వ నంబర్ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. దీంతో హైదరాబాద్ - నిజామాబాద్ మార్గంలో పలుచోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ - సిద్దిపేట రహదారిపై నిజాంపేట వద్ద ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో ఈ రూట్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ రహదారిపై పోచారం ప్రాజెక్టు పొంగి ప్రవహించడంతో వంతెన దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై భారీగా వరద నీరు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కామారెడ్డి-భిక్కనూరు మండలాల సరిహద్దులో జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపైకి భారీగా వచ్చిన వరద నీటితో రోడ్డు కోతకు గురైంది. సదాశివనగర్ మండలం కల్వరాల వద్ద కూడా ఎన్‌హెచ్ 44 కోతకు గురైంది. టేక్రియల్ వంతెన కోతకు గురైంది. హైదరాబాద్-నిజామాబాద్ ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి.

కొట్టుకుపోయిన రైల్వే లైన్లు

సికింద్రాబాద్-నిజామాబాద్ రైల్వే లైనుపై పలు చోట్ల మట్టికొట్టుకుపోయి ట్రాక్‌లు గాలిలో వేలాడడంతో రైళ్లను రద్దు చేశారు. మెదక్ జిల్లా శమ్‌నాపూర్ దేవుని చెరువు నీళ్ల ధాటికి రైల్వే ట్రాక్ కోతకు గురైంది. దీంతో అక్కన్నపేట - మెదక్ మార్గంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా తలమడ్ల సమీపంలో కూడా ట్రాక్ కోతకు గురికావడంతో సికింద్రాబాద్ - మన్మార్డ్ మా ర్గంలో రైళ్లు నిలిచిపోయాయి. ఈ రూట్లో రైళ్లు పునరుద్ధరించాలంటే రెండు రోజులైనా పట్టే అవకాశాలున్నాయని అంటున్నారు.

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో..

భూపాలపల్లి జిల్లా ఎగువనుంచి వరద నీరు వస్తుండటంతో మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహాముత్తారం మండలంలోని పెగడపల్లి, కేశవపూర్ మధ్య గల పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బ మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, భూపాలపల్లి ఏరియాలో మంగళవారం, బుధవారం కురిసిన వర్షానికి ఓపెన్‌కాస్ట్ 2,3 ప్రాజెక్టుల్లో 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లినట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. ములుగు జిల్లా మొండ్యాల తోగు వద్ద జాతీయ రహదారి వరద తాకిడికి భారీగా కోతకు గురైంది. ఊరట్టం తూ ముల వాగు వరద తాకిడికి బ్రిడ్జి సమీపంలో రోడ్యాం వద్ద సీసీ రోడ్డు కోతకు గురైంది. రంగాపూర్ పెద్ద చెరువు కట్ట తెగిపోయింది.

జల దిగ్బంధంలో సిద్దిపేట

రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సిద్దిపేట జిల్లా కేంద్రం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఎగువ నుంచి కోమటి చెరువుకు వరద నీరు చేరడంతో పొంగి పొర్లుతోంది. దీంతో పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, హరిప్రియానగర్, శ్రీనివాసనగర్, సీతారామంజనేయ థియేటర్ జలమయంగా మారాయి. హరిప్రియానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వరద నీరు చేరడంతో..వరద ప్రవాహంలోనే రోగులను స్ట్రెచర్‌పై మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్‌లోని లక్ష్మీప్రసన్న కాలనీ, ఎలైట్ ప్రజ్వల్ కాలనీ కూడా నీట మునిగాయి. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గజ్వేల్-దుబ్బాక మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంట పొంగి పొర్లుతుండటంతో వరద నీరంతా తూప్రాన్ రోడ్డు వై జంక్షన్ వద్ద నిలిచి 33/11 కేవీ సబ్ స్టేషన్ జలమయంగా మారింది. వరద ముంపులో చిక్కుకున్న సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు 22 గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అనంతరం ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పడవ ద్వారా వారిని ఒడ్డుకు చేర్చారు.

పోచారం ప్రాజెక్టుకు తప్పిన ముప్పు

కామారెడ్డి జిల్లాలోని పోచారం ప్రాజెక్టుకు భారీ ముప్పు తప్పింది. భారీ వర్షాలతో ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు పైభాగం నుంచి నీరు పడడంతో స్ట్రక్చర్‌కు ఒకచోట గొయ్యి ఏర్పడింది. ప్రాజెక్టు తెగిపోయినట్టేనని అందరూ భావించారు. కానీ వరద తీవ్రత తగ్గడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రైలుకు ఎదురెళ్లి నిలిపేసిన గ్యాంగ్‌మన్

గ్యాంగ్‌మన్ అప్రమత్తతతో పెద్ద రైలు ప్రమాదం తప్పింది. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి-తిప్పాపూర్ మధ్య 528 మైలురాయి వద్ద రైల్వే ట్రాక్ కింద ఉన్న మట్టికట్ట 50 గజాల మేర కొట్టుకుపోయింది. దీంతో రైలు పట్టాలు గాల్లో వేలాడుతున్నాయి. గ్యాంగ్‌మన్ రమేష్ దీన్ని గమనించి అప్రమత్తమయ్యాడు. భిక్కనూరు నుంచి వస్తున్న కాచిగూడ-పెద్దపల్లి ప్యాసింజర్ రైలుకు ఎదురుగా వెళ్లి అది ఆగిపోయేలా చూశాడు. ట్రాక్ కొట్టుకుపోయిన విషయాన్ని లోకో పైలట్‌కు తెలియజేయడంతో ఆయన స్టేషన్ మాస్టర్ భానుశేఖర్‌కు సమాచారం అందించారు. ఆయన ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంతో వారు వెంటనే సికింద్రాబాద్-నిజామాబాద్ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసి, కొన్ని రైళ్లను వేరే మార్గంలోకి మళ్లించారు. కాచిగూడ-పెద్దపల్లి ప్యాసింజర్ రైలులో 167 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరగకుండా వీరిని కాపాడిన గ్యాంగ్‌మన్ రమేష్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్, ప్రయాణికులు అభినందించారు.

మొదటి పేజీ తరువాయి

# కేటీఆర్, బండి సంజయ్ ఆప్యాయ పలక



ఈకబురు, :కేంద్ర మంత్రి బండి సంజయ్ మధ్య మాటల యుద్ధం అనునిత్యం కొనసాగుతూనే ఉంటుంది. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించడం, రాజకీయ వేదికలపై ఘాటు విమర్శలు చేసుకోవడం సర్వ సాధారణం. అలా పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉండే ఈ రాజకీయ ప్రత్యర్థులు.. ఎదురుపడితే ఎలా ఉంటుందో అన్న ఉత్కంఠకు తెర పడింది.

గురువారం, తెలంగాణలోని సిరిసిల్ల జిల్లాలో వరద బీభత్సం నేపథ్యంలో కేటీఆర్ వరద బాధితులను పరామర్శించి తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే సమయంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా వరద ప్రాంతాలను సందర్శించేందుకు అక్కడికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కేటీఆర్‌కు బండి సంజయ్ ఎదురుపడ్డారు. వీరిద్దరూ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ హఠాత్ పరిణామం అక్కడ ఉన్నవారిని ఆశ్చర్యానికి గురిచేసింది.

ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు రాజకీయాలకు అతీతంగా వెల్లివిరిసిన మానవత్వం అంటూ కామెంట్లు కురిపిస్తున్నారు. విపత్తు సమయంలో నాయకుల మధ్య ఏర్పడిన ఈ సానుకూల పరిణామం, ప్రజల్లో మంచి సందేశాన్ని పంపించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలం



ఈకబురు, :దిల్లీ: దేశవ్యాప్తంగా.. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో భారీవర్షాలతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, దంతెవాడ, బీజాపుర్, సుకుమా జిల్లాలు వరద గుప్పిట చిక్కుకున్నాయి. నీట మునిగి 8 మంది మృతి చెందారు. సుమారు 2,000 మందికి పైగా పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారణాసిలో గంగానది నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. దీంతో పలు ఘాట్లలో పుణ్యస్నానాలు, గంగాహారతి, దహనసంస్కారాలు, కర్మకాండలు వంటి కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది.

18 మృతదేహాలు వెలికితీత

జమ్మూకశ్మీర్‌లో వర్షాలు..ఆకస్మిక వరదల కారణంగా ఇప్పటివరకు 41 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. కత్రాలోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడి చనిపోయిన 34 మందిలో 18 మంది మృతదేహాలను వెలికితీశారు. ఈ యాత్రను కొనసాగించడంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని సీఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెగక కురుస్తున్న వానలతో గురువారం రావి నదికి అకస్మాత్తుగా వరద పోటెత్తింది. దీంతో కాంగ్డా జిల్లా బడా బంగాల్ గ్రామంలో పలు ప్రభుత్వ బంగ్లాలు కొట్టుకుపోయాయి. మండీ జిల్లాలో కొండచరియలు విరిగిపడి చండీగఢ్ మనాలి జాతీయ రహదారిలో సుమారు 50 కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించింది. పంజాబ్‌లోని పలు జిల్లాలు వరద గుప్పిట చిక్కుకున్నాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లోనూ వర్షాలు, వరదలు కొనసాగుతున్నాయి.

# భారత్ కెనడా సంబంధాల్లో పురోగతి..

## దౌత్యవేత్తల పునర్నియామకం

ఈకబురు, :దిల్లీభారత్, కెనడాల మధ్య సంబంధాలు మళ్లీ పట్టాలెక్కుతున్నాయి. ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను పునర్నియమించాయి. కెనడాకు భారత హైకమిషనర్‌గా దినేశ్ కె.పట్నాయక్ నియమితులయ్యారు. ఆ దేశం సైతం భారత్‌లో తన హైకమిషనర్‌గా క్రిస్టోఫర్ కూటర్‌ను ప్రకటించింది. దినేశ్ కె.పట్నాయక్ 1990 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి. ప్రస్తుతం స్పెయిన్‌లో భారత రాయబారిగా విధులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఆయన కెనడాలో భారత హైకమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు విదేశాంగశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. జూన్‌లో కెనడా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీతో ప్రధాని మోదీ సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా దౌత్యవేత్తల పునర్నియామకంపై ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. పరస్పర గౌరవం, చట్టాలకు కట్టుబడి ఉండటం సహా ఇరు దేశాల్లోని పౌరులు, వ్యాపారులకు సాధారణ సేవలు తిరిగి అందించే ఉద్దేశంతో దౌత్యవేత్తల పునర్నియామకానికి మోదీ, కార్నీలు అంగీకరించారని కెనడా ప్రధాని కార్యాలయం కూడా ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు రెండు దేశాలూ చర్యలు తీసుకున్నాయి.ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్ కెనడాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించారు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. ఇరుదేశాలూ పరస్పరం దౌత్యవేత్తలను వెనక్కి పంపించాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ దేశంలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన మార్క్ కార్నీ.. న్యూదిల్లీతో సంబంధాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు.



మొదటి పేజీ తరువాయి

# హైడ్రాను అభినందించిన హైకోర్టు



ఈకబురు, హైదరాబాద్ : పర్యావరణహితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న హైడ్రాను హైకోర్టు గురువారం అభినందించింది. రహదారులపై రాకపోకలకు ఆటంకంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించే విషయంలో హైడ్రా అవసరముందంటూ జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం వ్యాఖ్యానించింది. రోడ్డు ఆక్రమణపై రాంనగర్ మణెమ్మ వీధి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ గతంలో జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసింది. జీహెచ్‌ఎంసీ ..హైడ్రా సహకారాన్ని కోరడంతో జమిస్తాన్‌పూర్ రాంనగర్ క్రాస్‌రోడ్ వద్ద రోడ్డును ఆక్రమించి నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని తొలగించింది. దీంతో రాంనగర్ ప్రధాన రహదారికి వెళ్లేందుకు ఆటంకం తొలిగిపోయింది. దీనిపై ఆ వాణిజ్య సముదాయం నిర్మాణదారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగానే రహదారులపై ఆక్రమణలు తొలగించే విషయంలో హైడ్రా సేవలు అవసరమని ధర్మాసనం పేర్కొంది. ప్రజాప్రయోజనాలకు లోబడే ప్రైవేటు ప్రయోజనాలు ఉండాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఆరోగ్యశాఖలో పదోన్నతుల పండుగ



### 63 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి ఏడుగురు డీడీలకు జేడీలుగా పోస్టింగ్స్

ఈ-కబురు, ప్రభుత్వ వైద్య కళాశాల్లో ప్రొఫెసర్ల కొరతను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 63 మందికి పదోన్నతి లభించింది. జాతీయ వైద్య సంఘం నియమాల మేరకు వివిధ కళాశాలల్లో ప్రొఫెసర్ల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం నిబంధనలు సడలించింది. నిబంధనల ప్రకారం అసోసియేట్ ప్రొఫెసర్‌గా మూడేళ్ల పనిచేసిన వారు మాత్రమే ప్రొఫెసర్ పదోన్నతికి అర్హులు. అయితే ప్రభుత్వం దీన్ని సడలిస్తూ.. ఒక ఏడాది అనుభవమున్న అసోసియేట్ ప్రొఫెసర్లను కూడా ప్రొఫెసర్లుగా నియమించేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు 11 క్లినికల్ విభాగాలు, 2 నాన్ క్లినికల్ విభాగాల్లో 63 మందిని డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) పదోన్నతికి సిఫారుసు చేసింది. ఈ విధంగా పదోన్నతి పొందిన ప్రొఫెసర్లకు పోస్టింగులు ఇచ్చేందుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో 35 మంది కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో, 38 మంది పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పని చేయడానికి అంగీకరించగా.. వారందరికీ పోస్టింగ్‌లు ఇచ్చారు. కాగా, ఆరోగ్యశాఖలో సుదీర్ఘకాలంగా పదోన్నతికి నోచుకోని డిప్యూటీ డైరెక్టర్ల (డీడీ)కు ఎట్టకేలకు ప్రమోషన్ లభించింది. సర్వీసు నిబంధనల ప్రకారం రెండేళ్లు డీడీగా పనిచేసిన వారు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతికి అర్హుత లభిస్తుంది. అయినా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు డీడీలు 20 ఏళ్లుగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. మరో ఇద్దరు 11 ఏళ్లుగా పదోన్నతి లేక ఇబ్బంది పడుతున్నారు. కాగా, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్యూటీ డైరెక్టర్లుగా ఉన్న రాజాభాను, పాండురంగప్రసాద్‌కు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించి, పోస్టింగ్స్ ఇచ్చారు.

# నేను బతికుండగా... ప్రజల ఓటుహక్కును హరించనీయను

ఈకబురు, :కోల్‌కతా: తాను బతికున్నంత వరకూ ప్రజల ఓటు హక్కును ఎవరూ హరించకుండా చూస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం స్పష్టం చేశారు. బెంగాలీలలో భాషాపరమైన భయాన్ని భాజపా ప్రేరేపిస్తోందని ఆమె ఆరోపించారు. కోల్‌కతాలో జరిగిన టీఎంసీ విద్యార్థి విభాగం ర్యాలీలో మమత పాల్గొని ప్రసంగించారు. "పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించే లక్ష్యంతో సర్వేలు నిర్వహించడానికి భాజపా దేశం నలుమూలల నుంచి 500కు పైగా బృందాలను రంగంలోకి దింపింది. మీ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయా, తొలగించారా అన్నది మీరే చూసుకోవాలి. మీ వద్ద ఆధార్ కార్డులు ఉండేలా చూసుకోండి. ఎన్నికల సంఘం రాష్ట్ర అధికారులను బెదిరిస్తోంది. స్వాతంత్ర్యోద్యమంలో బెంగాలీల పాత్రను ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయడానికి భాజపా ప్రయత్నిస్తోంది" అని ఆమె అన్నారు. సర్వేల పేరుతో



మీ ఇంటికి ఎవరైనా వస్తే వారికి మీ వివరాలు ఇవ్వకండి, మీరే స్వయంగా ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో చూసుకోండి, అని ఆమె పేర్కొన్నారు.

# సీఎస్ సర్వీసు 7 నెలలు పొడిగింపు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావు ఈ నెల 31తో పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఆయన సర్వీసును మరో 7 నెలలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) అండర్ సెక్రటరీ భూపేందర్ పాల్ సింగ్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఏఐఎస్ (సీఎస్-ఆర్ఎం) రూల్స్-1960లోని రూల్-3ని ప్రయోగించడం ద్వారా ఏఐఎస్ (డీసీఆర్బీ) రూల్స్‌లోని 16(1) నిబంధనను సడలిస్తూ రామకృష్ణారావు సర్వీసును పొడిగించినట్టు కేంద్రం తెలిపింది. దీంతో వచ్చే ఏడాది మార్చి 31 వరకు రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు. 1991 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన రామకృష్ణారావు గత ఏప్రిల్ 30న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన సుదీర్ఘకాలం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

**పొడిగింపు పొందిన రెండో సీఎస్**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత తొలి సీఎస్‌గా పనిచేసిన రాజీవ్ శర్మ పదవీ కాలాన్ని ఒకసారి 3 నెలలు, ఆ తర్వాత మరో మూడు నెలలు పొడిగించేందుకు కేంద్రం అనుమతించింది. ఆ తర్వాత పదవీ కాలం పొడిగింపు పొందిన రెండో సీఎస్‌గా రామకృష్ణారావు నిలిచారు. గతంలో ఒక ప్రయత్నంలో మూడు నెలలు మాత్రమే సర్వీసు పొడిగించగా, రామకృష్ణారావు విషయంలో మాత్రం ఒకేసారి ఏడు నెలల సర్వీస్ పొడగింపునకు కేంద్రం అనుమతించడం గమనార్హం.



# భారతీయుల్లో వీసా గుబులు

### విద్యార్థి వీసాకు నాలుగేళ్ల పరిమితి విధించే యోచనలో అమెరికా

ఈకబురు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలతో అక్కడున్న భారత విద్యార్థులు వణికిపోతున్నారు. వీసా గడువును పరిమితం చేయాలంటూ తీసుకున్న తాజా నిర్ణయం మరింత ఆందోళన కల్గిస్తోంది. ప్రస్తుతం అమెరికాలో విద్యార్థులకు ఎలాంటి నిర్దేశిత గడువు లేదు. ఇప్పుడు దీన్ని నాలుగేళ్లకు కుదించాలని ప్రభుత్వం చేసిన ప్రతిపాదన మన విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. ఎంఎస్ కోసం వెళ్లిన విద్యార్థులు రెండేళ్లల్లో కోర్సు పూర్తి చేసి.. ఆ తర్వాత ఉద్యోగం కోసం వెతుక్కుంటారు.

కనీసం మూడేళ్లల్లో ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడతారు. అప్పుడు వారికి హెచ్ 1బీ వీసా వస్తుంది. కొంతకాలం ఉద్యోగం చేయడానికి అవకాశం లభిస్తుంది. ఇప్పుడు వీసా గడువును నాలుగేళ్లకు తగ్గించడంతో ఎంఎస్ పూర్తయ్యాక, ఉద్యోగానికి అవసరమైన శిక్షణ, ఉద్యోగం వెతుక్కునే సమయం ఉండదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికే పార్ట్ టైం ఉద్యోగాలకు కోత పడ్డాయి. ట్రంప్ నిర్ణయాలతో భారత్‌లో ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ గుబులు పెరుగుతోంది.

**తగ్గుతున్న అవకాశాలు**

అమెరికాలో భారత విద్యార్థులు ప్రధానంగా పార్ట్ టైం ఉద్యోగాలపైనే ఆశలు పెట్టుకుంటారు. 2019కి ముందుతో పోలిస్తే 2023లో ఈ అవకాశాలు 40 శాతం తగ్గినట్లు విదేశాంగ శాఖ అధ్యయనంలో గుర్తించారు. ఈ దేశానికి అగ్రరాజ్యానికి ఏటా 3 లక్షల మంది భారతీయులు వెళ్తుంటే, వారిలో 1.25 లక్షల మంది తెలుగు వారే ఉండటం గమనార్హం. కరోనా తర్వాత ఏ దేశం నుంచి వచ్చిన విద్యార్థి అయినా పార్ట్ టైం ఉద్యోగం కోసం పోటీపడాల్సి వస్తోంది. దీంతో అవకాశాలకు భారీగా గండి పడింది.

అమెరికాతో పోలిస్తే కెనడాలో 30 శాతం ఫీజులు తక్కువ ఉంటాయి. అయితే ఇటీవల కెనడాలోనూ అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వీసా నిబంధనల్లో మార్పులు వచ్చాయి. 2020-21లో చదువు పూర్తి చేసిన వారికి పార్ట్‌టైం ఉద్యోగాలు వచ్చే పరిస్థితి తగ్గింది. బ్రిటన్, ఆస్ట్రేలియాలోనూ విద్యార్థులకు ప్రతికూల పరిస్థితులే కన్పిస్తున్నాయి.

**ఏటా రూ.5.86 లక్షల కోట్లు**

అమెరికాలో రెండేళ్లుగా ఖర్చులు పెరిగాయి. రూపాయి మారక విలువతో పోలిస్తే యూనివర్సిటీ ఫీజులూ పెరిగాయి. సాధారణంగా ఏదో ఒక పార్ట్ టైం ఉద్యోగం చేసుకుంటూ విద్యార్థులు నెట్టుకొస్తారు. ట్రంప్ వచ్చిన తర్వాత ఈ అవకాశం లేకుండా పోయింది. దీంతో ఇండియాలో ఉన్న తల్లిదండ్రులను డబ్బు కోసం ఆశ్రయిస్తున్నారు. అమెరికాకు పంపేటప్పుడే అప్పులు చేసిన తల్లిదండ్రులు మళ్లీ అప్పులు తేవడం కష్టంగా ఉంటోంది. ఏటా పర్యాటకులతో కలిపి 13 లక్షల మంది భారతీయులు విదేశాలకు వెళ్తున్నారు. 2025లో ఈ సంఖ్య 15 లక్షలకు చేరింది. భారత్ నుంచి విదేశాలకు చదువుల కోసం వెళ్లే వారిలో 38 శాతం తెలంగాణ, ఏపీ వారే ఉన్నారు. 2019లో విదేశీ విద్యకు భారతీయులు చేసిన ఖర్చు రూ.3.10 లక్షల కోట్లు. 2022 నాటికి ఇది 9 శాతం పెరిగి రూ. 3.93 లక్షల కోట్లకు చేరింది. 2024లో ఖర్చు సుమారు 10 శాతం మేర పెరిగి, రూ. 4.32 లక్షల కోట్లకు చేరింది. ఇటీవల కాలంలో రూపాయి విలువ ఊహించని విధంగా పతనమవ్వడంతో 2025లో విదేశాలకు వెళ్లే విద్యార్థులపై 14 శాతం అదనపు భారం పడే వీలుంది. అంటే, రూ. 5.86 లక్షల కోట్ల మేర విదేశీ విద్య భారం ఉండొచ్చని విదేశాంగ శాఖ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.

**ఫీజు తలచుకుంటేనే...**

విదేశీ విశ్వవిద్యాలయాల్లో ట్యూషన్ ఫీజులు తలచుకుంటే భారత విద్యార్థులు వణికిపోతున్నారు. విదేశాలకు వెళ్లే ముందు అమెరికా వర్సిటీల ఫీజు సగటున రూ.24 లక్షలుగా అంచనా వేసుకున్నారు. డాలర్ ముందు రూపాయి నేల చూపులు చూడటంతో ఇప్పుడు కనీసం రూ.2.40 లక్షలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. కెనడాలో రూ.1.60 లక్షలు, ఆస్ట్రేలియాలో రూ.1.80 లక్షలు, బ్రిటన్‌లో రూ.2 లక్షలకు పైగా అదనపు వ్యయం సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు వసతి ఖర్చులు ఏకంగా 10-15 శాతం పెరిగాయి.

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఇతర సంక్షోభాల నేపథ్యంలో జీవన వ్యయం ఏకంగా 22 శాతం పెరిగింది. దీంతో విద్యార్థుల అంచనాలు తారుమారయ్యాయి. అమెరికాలో రూ.43 లక్షలతో ఎంఎస్ పూర్తవుతుందని అంచనా వేసుకుంటే, ఇప్పుడది రూ.52 లక్షల వరకూ వెళ్లిందని అంటున్నారు. ఆర్థిక పరిస్థితి ఇలా ఉంటే.. వీసా కాల పరిమితి తగ్గించడంతో భవిష్యత్‌లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన మొదలైంది.

**వీసా కుదిస్తే ఎలా..**

ఎంఎస్ పూర్తయ్యే వరకూ ఉద్యోగం చేయకూడదు. ఎంఎస్ అయ్యాక ఉద్యోగానికి అవసరమైన శిక్షణ తీసుకుంటారు. అప్పటికే మూడున్నరేళ్లు పూర్తవుతుంది. మిగిలిన ఆరు నెలల్లో ఉద్యోగం రాకపోతే హెచ్-1బీ వీసా రాదు. కాబట్టి భారత్‌కు వెళ్లాలి. నేను ఎంఎస్ పూర్తి చేసి ఆరు నెలలైంది. రూ.40 లక్షల అప్పు చేశాను. మరో రెండేళ్లు ఉద్యోగం రాకపోతే అప్పు రెట్టింపవుతుంది. అమెరికా ఆంక్షల వల్ల నలిగిపోతున్నాం. - మందస బాల శేఖర్ (అమెరికాలో భారత విద్యార్థి)

**ఇది అన్యాయం**

ట్రంప్ వచ్చిన తర్వాత ఐటీ రంగం పరిస్థితి మారిపోయింది. ప్రతి కంపెనీలోనూ అనుభవం అడుగుతున్నారు. విద్య పూర్తి చేసిన వెంటనే అనుభవం ఎలా వస్తుంది. అనుభవం కోసం కనీసం ఏడాది ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉండాలి. వీసా కాలపరిమితి కుదిస్తే విద్యార్థులు నష్టపోతారు. -పరమేశ్వర్ త్రిపాఠి (అమెరికాలో భారత కన్సల్టెన్సీ నిర్వాహకుడు)




# 75 ఏళ్లకు వైదొలగాలని చెప్పలేదే : భాగవత్

ఈకబురు, దిల్లీ: తానో మరొకరో 75 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని ఎప్పుడూ అనలేదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భాగవత్ స్పష్టంచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం దాదాపు రెండున్నర గంటల పాటు ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పదవీ విరమణకు తాము ఎప్పుడైనా సిద్ధమేనని, సంఘ్ కోరుకున్నంతకాలం పనిచేస్తామని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ కేవలం అయోధ్య రామమందిర ఉద్యమానికే మద్దతు తెలిపిందని, కాశీమథుర ఆలయంతో సహా మరే ఆలయ ఉద్యమానికీ మద్దతు ఇవ్వబోదని స్పష్టంచేశారు. 'దేశ విభజనపై సంఘ్ ఆనాడు నిరసన తెలిపినా ఫలితం లేకపోయింది. జనాభా కూర్పులో మార్పులకు మత మార్పిళ్లు, అక్రమ వలసలే కారణం. మతాన్ని ఎంచుకునే స్వేచ్ఛ వ్యక్తులకు ఉంది. అయితే ప్రలోభాలు, బలవంతాలు ఉండకూడదు. మనం అక్రమ వలసదారులకు ఉద్యోగాలు ఇవ్వకూడదు. ముస్లింలతో సహా మనవారికి మాత్రమే ఇవ్వాలి' అని ఆయన అన్నారు. సంస్కృతాన్ని తప్పనిసరి చేయాలని సంఘ్ కోరడం లేదని.. దేశ సంప్రదాయాలు, చరిత్ర గురించిన అవగాహన ప్రధానమని అన్నారు. భాజపాకు సంబంధించిన ప్రతి విషయాన్నీ ఆర్‌ఎస్‌ఎస్ నిర్ణయిస్తుందన్న భావన పూర్తిగా వాస్తవ విరుద్ధమని భాగవత్ స్పష్టం చేశారు.

దాడులకు వ్యతిరేకం: "మతపరమైన దాడుల్ని సంఘ్ సమర్థించదు. ఇస్లాం ఉండకూడదన్నది హిందూ ఆలోచనా విధానం కాదు. భారత్‌పై అమెరికా 50% సుంకాలు ఆందోళనకరం. అంతర్జాతీయ వాణిజ్యం అవసరమే కానీ ఒత్తిడి కింద స్నేహం సాధ్యం కాదు" అని భాగవత్ అన్నారు.పొడగింపునకు కేంద్రం అనుమతించడం గమనార్హం.




# ఉక్రెయిన్‌పైకి 598 డ్రోన్లు, 31 క్షిపణులు



కీవ్: ఓవైపు యుద్ధాన్ని ఆపడానికి శాంతి ప్రయత్నాలు జరుగుతున్నా, ఉక్రెయిన్‌పై రష్యా దాడుల తీవ్రతను మాత్రం తగ్గించడంలేదు. బుధవారం రాత్రి నుంచి ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు నగరాలపై మాస్కో దాదాపుగా 598 డ్రోన్లు, 31 క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో 17 మంది పౌరులు మృతి చెందారు, 48 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. రష్యా దాడుల్లో కీవ్‌లోని ఐరోపా సమాఖ్య కార్యాలయాలకు కూడా నష్టం వాటిల్లిందని స్థానిక అధికారులు తెలిపారు. చర్చలు జరపడానికి బదులు బాలిస్టిక్ మిసైళ్లు ప్రయోగించడానికే రష్యా ఇష్టపడుతోందని దాడి అనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

# ఆటలంటే హైదరాబాద్ పేరే చెప్పుకోవాలి!

**క్రీడా ప్రపంచం దృష్టి మనపైనే ఉండాలి**

**క్రీడా రంగం బడ్జెట్ 16 రెట్లు పెంచాం**

**ఇకపై ఆటల పోటీలు గ్రామ స్థాయి నుంచి అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయి దాకా..**

**వాటిలో ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్ల ఎంపిక**

**స్పోర్ట్స్ హబ్ బోర్డ్ భేటీలో సీఎం రేవంత్**

ఈకబురు, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రపంచమంతా హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అన్నిరకాల క్రీడలకు హైదరాబాద్ వేదికగా మారాలని ఆకాంక్షించారు. గురువారం 'తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు' మొదటి సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగు పర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా విధానంలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు ఉప సంఘాల ఏర్పాటుకు తీర్మానాలు చేశారు. ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్.. ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. బోర్డులోని సభ్యులు సలహాలు, సూచనలను ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ, తెలంగాణలో ఐటీ సంస్కృతి తరహాలో క్రీడా సంస్కృతి రావాలని పిలుపునిచ్చారు. క్రీడారంగానికి బడ్జెట్ 16 రెట్లు పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నారు. వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడారంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. క్రీడారంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని వివరించారు.

క్రీడా పోటీల విధానాన్ని మార్చనున్నట్టు సీఎం ప్రకటించారు. ఆటల పోటీలను గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తామని చెప్పారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి, అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి, దాని ప్రకారం రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు. క్రీడా సామగ్రిపై పన్నుల తగ్గింపునకు కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశ పెడతామని తెలిపారు. కోచ్‌లకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. మూడేళ్లలో సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశం అనంతరం హైదరాబాద్‌లో అక్టోబరు 2 నుంచి ప్రారంభమయ్యే ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీఎల్‌వీ) పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.



# అమెరికా 50% సుంకాలు అమల్లోకి వచ్చాయ్




## రొయ్యలు, జౌళి, వజ్రాలు, పాదరక్షలపై అధిక ప్రభావం

దిల్లీ: భారత ఎగుమతులపై అమెరికా విధించిన 50% సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో రొయ్యలు, జౌళి, వజ్రాలు, తోళ్లు, పాదరక్షలు, రత్నాభరణాలు వంటి కార్మిక ప్రభావిత రంగాల ఎగుమతులు, ఉద్యోగాల సృష్టిపై ప్రతికూల ప్రభావం పడనుంది. భారత్‌పై 25% సుంకాలతో పాటు మరో 25% జరిమానాను విధించడంతో మన ఎగుమతుల కు ఆటంకాలు ఏర్పడతాయని ఎగుమతిదార్లు చెబుతున్నారు. 202425లో భారత ఎగుమతుల విలువ 437.42 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో అమెరికా వాటా 20%. 202122 నుంచి మనకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా కొనసాగుతోంది.10.3 బి.డాలర్ల ఎగుమతులు చేసే జౌళి రంగంపై అధిక ప్రభావం పడిందని దుస్తుల ఎగుమతిదారు ఒకరు వెల్లడించారు. బంగ్లాదేశ్, వియత్నాం, శ్రీలంక, కంబోడియా, ఇండోనేసియా వంటి పోటీ దేశాలతో పోలిస్తే 3031% టారిఫ్ తేడా ఉందని, ఇది మన పరిశ్రమను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.అమెరికా మార్కెట్‌పై మనం ఎక్కువగా ఆధారపడి ఉన్నామని జెమ్స్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) ఛైర్మన్ కిరిట్ భన్సాలీ పేర్కొన్నారు. కట్, పాలిష్డ్ వజ్రాల్లో సగానికి పైగా ఎగుమతులు అమెరికాకే వెళ్తున్నాయని, తాజా టారిఫ్‌లతో తుర్కియే, వియత్నాం వంటి దేశాలు లబ్ధి పొందుతాయన్నారు.

అధిక టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో భారత రొయ్యలు భారీగా ప్రియం కానున్నాయి. మనపై 2.49% దిగుమతి నిరోధక సుంకం, 5.77% కౌంటర్‌వెయిలింగ్ సుంకంతో పాటు తాజాగా 50% సుంకాలు వేయడం ప్రతికూలం కానుంది.

కొన్ని కంపెనీల చేతిలో దాదాపు 23 నెలలకు ఆర్డర్లు ఉన్నాయని, ఈ ఆర్డర్లను కొనసాగించాలంటే అమెరికా సంస్థలు 20 శాతం రాయితీ డిమాండ్ చేస్తున్నాయని ఒక తోళ్ల ఎగుమతిదారు వాపోయారు. 202531 మధ్య ఆరు ఆర్థిక సంవత్సరాల్లో ఎగుమతిదార్ల కోసం రెండు ఉప పథకాల ద్వారా రూ.25,000 కోట్లు అందించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నిర్యత్ ప్రోత్సాహన్ కింద రూ.10,000 కోట్లు, నిర్యత్ దిశ కింద రూ.14,500 కోట్లకు పైగా అందించాలని భావిస్తోంది.

**సుంకాలతో షేర్లు బెంబేలు**

**అమెరికా 50% సుంకాలు అమల్లోకి రావడంతో జౌళి, రొయ్యలు, తోళ్లు, రత్నాభరణాల కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. జౌళి షేర్లలో కైటెక్స్ 5%, పెర్ల్ గ్లోబల్ 2.94%, సియారామ్ 2.56%, రేమండ్ లైఫ్‌స్టైల్ 2.37%, అలోక్ ఇండస్ట్రీస్ 1.59%, రూపా 1.43%, వెల్‌స్పన్ లివింగ్ 1.09%, ట్రైడెంట్ 1.01% నష్టపోయాయి. రొయ్యలు ఎగుమతి చేసే అపెక్స్ ఫ్రోజెన్ 5.36%, వాటర్‌బేస్ 3.38%, అవంతీ ఫీడ్స్ 0.82% తగ్గాయి. పాదరక్షల కంపెనీల్లో ఖాదిమ్ 1.95%, రిలాక్సో 1.84% పడ్డాయి. రత్నాభరణాల షేర్లలో బ్లూస్టోన్ జువెలరీ 3.51%, స్కైగోల్డ్ 3.23%, శాంతి గోల్డ్ 3.05% క్షీణించాయి.**

వాణిజ్యం ఇప్పుడో ఆయుధం: రఘురాం రాజన్

"టారిఫ్‌ల భారం భారత్‌కు ఓ మేలుకొలుపు లాంటిది. ఏ దేశంపైనా అధికంగా ఆధారపడకూడదు. అమెరికాతో వాణిజ్యం కొనసాగిస్తూనే ఐరోపా, ఆఫ్రికా వంటి దేశాలపైనా దృష్టి సారించాలి. ఈ రోజుల్లో వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక అవసరాలు యుద్ధానికి ఆయుధాలుగా మారుతున్నాయి. వీటిపట్ల ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలి. వృద్ధికి ఊతమిచ్చే, యువతకు ఉపాధి కల్పించే సంస్కరణలను తీసుకురావాలి. కరెంటు ఖాతా లోటు, ద్రవ్య లోటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అమెరికాను ఇతర దేశాలు వాడుకుంటున్నాయని ట్రంప్ భావిస్తున్నారు. కానీ, చౌక ధరకు వస్తువులను దిగుమతి చేసుకుంటున్నందుకు అమెరికా వినియోగదారులే ప్రయోజనం పొందుతున్నారన్న విషయాన్ని మర్చిపోయారేమో. ఇక, ఈ సుంకాలను ఆయన ఇతర దేశాలపై పన్నులుగా పరిగణిస్తున్నారు. తద్వారా అమెరికాకు ఆదాయం సమకూరుతుందని ఆలోచిస్తున్నారు. అయితే, దీని వల్ల సొంత ప్రజలకే నష్టం జరుగుతుందన్న విషయాన్ని గుర్తించట్లేదు. సైనిక శక్తిని ఉపయోగించలేని సందర్భాల్లో టారిఫ్‌లను తమ బలప్రయోగం కోసం ట్రంప్ వినియోగించుకుంటున్నారు" అని రాజన్ పేర్కొన్నారు.

# సుంకాల ప్రభావం.. స్టాక్ మార్కెట్ల పతనం



బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన అమెరికా ఎగుమతులపై 50 శాతం సుంకాల ప్రభావంతో భారత స్టాక్స్ నష్టాల్లో గురువారం ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 705.97 పాయింట్లు (0.87 శాతం) క్షీణించి 80,080.57 వద్ద, నిఫ్టీ 50 211.15 పాయింట్లు లేదా 0.85 శాతం క్షీణించి 24,500.9 వద్ద స్థిరపడ్డాయి.

బీఎస్ఈలో హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, టైటాన్, ఎల్అండ్‌టీ, మారుతీ సుజుకీ, యాక్సిస్ బ్యాంక్ టాప్ గెయినర్‌గా నిలిచాయి.

విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 వరుసగా 1.27 శాతం, 1.45 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 1 శాతానికి పైగా క్షీణించాయి. నిఫ్టీ కన్జ్యూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.

## వాటర్ ప్యూరిఫయర్స్‌పై జీఎస్టీ తగ్గించండి: ఆర్థికశాఖకు వినతి




న్యూఢిల్లీ: నీటి శుద్ధి యంత్రాలు , వాటి ఫిల్టర్లు, సంబంధిత సేవలపై ప్రస్తుతం ఉన్న 18% జీఎస్టీని 5%కి తగ్గించాలని వాటర్ క్వాలిటీ ఇండియా అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాసింది. నీటి శుద్ధి యంత్రాలను సామాన్యులకు మరింత అందుబాటులోకి తీసుకురావడమే దీని వెనుక ముఖ్య ఉద్దేశమని ఆ లేఖలో పేర్కొంది. సురక్షితమైన తాగునీటిని విలాసవంతమైన వస్తువుగా కాకుండా నిత్యావసర వస్తువుగా పరిగణించాలని కోరింది.

లేఖలోని ప్రధాన అంశాలు

నీటి శుద్ధి యంత్రాలపై 18% జీఎస్టీ విధించడం వల్ల అవి ఎయిర్ కండిషనర్లు, కార్ల మాదిరిగా అధిక పన్ను పరిధిలోకి వస్తున్నాయి. అయితే, ఇవి ప్రజల ఆరోగ్యానికి అత్యంత అవసరం అని వాటర్ క్వాలిటీ ఇండియా అసోసియేషన్ వాదించింది.

# టీవీఎస్ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్..

**టీవీఎస్ మోటార్ కంపెనీ తన లేటెస్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఆర్బిటర్ ను లాంచ్ చేసింది. సెగ్మెంట్-ఫస్ట్ ఫీచర్లతో దీన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధర రూ .99,900 (ఎక్స్-షోరూమ్, పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్, బెంగళూరు, న్యూఢిల్లీతో సహా). దీన్ని ఒక్కసారి ఛార్జ్ చేస్తే 158 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్‌ను అందిస్తుంది.ఆర్బిటర్ 3.1 కిలోవాట్ల బ్యాటరీతో పనిచేస్తుంది. ఇందులో 14 అంగుళాల ఫ్రంట్ వీల్, క్రూయిజ్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, రీజెనరేటివ్ బ్రేకింగ్, రెండు హెల్మెట్లు పట్టేంత 34 లీటర్ల పెద్ద బూట్ స్పేస్ ఇందులో ఉన్నాయి. కనెక్టెడ్ యాప్, టర్న్ బై టర్న్ నావిగేషన్, జియో ఫెన్సింగ్, టైమ్ ఫెన్సింగ్, క్రాష్/ఫాల్ అలర్ట్స్ , యాంటీ థెఫ్ట్ నోటిఫికేషన్లు, ఓటీఏ (ఓవర్ ది ఎయిర్) సాఫ్ట్‌వేర్ అప్డేట్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్ ఇంటిగ్రేషన్‌ను ఈ స్కూటర్ అందిస్తోంది. కలర్ ఎల్‌సీడీ క్లస్టర్ కాల్స్, మెసేజ్ లు, పర్సనలైజ్డ్ అలర్ట్ లను ప్రదర్శిస్తుంది.పొడవైన 845 ఎంఎం ఫ్లాట్ ఫార్మ్ సీట్, స్ట్రెయిట్ లైన్ ఫుట్ బోర్డ్, నిటారుగా ఉండే హ్యాండిల్ బార్ తో డిజైన్ చేసిన ఈ ఆర్బిటర్ రైడర్ కంఫర్ట్, ఎర్గోనామిక్స్ కు ప్రాధాన్యమిస్తుంది. ఎల్ఈడీ లైటింగ్, ఎమర్జెన్సీ నోటిఫికేషన్స్, లైవ్ ట్రాకింగ్, టోయింగ్ అలర్ట్స్ , 169 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ వంటి ఫీచర్లు ఈ ఎలక్ట్రిక్ స్కూటర్లో ఉన్నాయి.ఆర్బిటర్ నియాన్ సన్బర్స్ట్, స్ట్రాటోస్ బ్లూ, లూనార్ గ్రే, స్టెల్లార్ సిల్వర్, కాస్మిక్ టైటానియం, మార్స్ కాపర్ అనే ఆరు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.**



# జీపీటీ-5తో నా పనులు ఈజీ'.. సత్యనాదెళ్ల టాప్-5 ప్రాంప్ట్స్ ఇవే!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల తన రోజువారీ పనులు సులువయ్యాయని అంటున్నారు ప్రముఖ టెక్ కంపెనీ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల. తాజాగా మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్‌తో అనుసంధానమైన జీపీటీ5 తన రోజువారీ జీవితంలో అంతగా భాగమైందని పేర్కొన్నారు. తన మీటింగ్స్, ఇమెయిల్స్, ప్రాజెక్ట్ అప్‌డేట్స్ వంటి పనులను జీపీటీ5కిచ్చే ప్రాంప్ట్‌స్‌తో చక్కబెడుతున్నానని చెప్పుకొచ్చారు. అవుట్‌లుక్, టీమ్స్, వర్డ్, ఎక్సెల్ వంటి యాప్స్‌లో మెయిల్స్, మీటింగ్స్, చాట్స్ డేటాను విశ్లేషించి స్పష్టమైన సూచనలు ఇస్తోందని తెలిపారు. ఆయన ఉపయోగించే ఐదు ప్రత్యేక ప్రాంప్ట్‌లను ఉదాహరణలతో చూపించారు. అవేంటంటే..?

'మన మునపటి సంభాషణల ఆధారంగా తర్వాత మీటింగ్‌కు ఉపయోగపడే 5 టాప్ అంశాలను ఇవ్వు' అనే ప్రాంప్ట్‌ను సత్య నాదెళ్ల ఇచ్చారు. దీంతో సదరు వ్యక్తితో గత మొయిల్స్, చాట్స్, మీటింగ్స్ అన్నింటినీ స్కాన్ చేసి రాబోయే మీటింగ్‌లో ప్రధానంగా చర్చించాల్సిన 5 పాయింట్లను జీపీటీ5 అందించింది.

ఇమెయిల్స్, చాట్స్, మీటింగ్స్ ఆధారంగా ప్రాజెక్ట్ అప్‌డేట్‌ను రూపొందించాలని ప్రాంప్ట్ అడిగినప్పుడు.. కమ్యూనికేషన్ డేటా అంత సమీకరించి KPIs vs టార్గెట్లు, విజయాలు, అపజయాలు, రిస్కులు, పోటీదారుల కదలికలు వంటివి జీపీటీ5 తెలియజేస్తోంది. అంతేకాక స్టేక్ హోల్డర్లు అడగబోయే కఠినమైన ప్రశ్నలను ముందే అంచనా వేసి సమాధానాలను కూడా సూచిస్తోంది.

'నవంబర్‌లో ప్రొడక్ట్ లాంచ్‌కు మన సన్నద్ధత ఎంత? ఇంజినీరింగ్ పురోగతి, పైలట్ ప్రోగ్రామ్ ఫలితాలు, ప్రాబబిలిటీ చెప్పు' అని అడిగినప్పుడు.. లాంచ్ ట్రాక్‌లో ఉందా?లేదా? అడిగిన అంశాలన్నింటినీ విశ్లేషించి ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నామో తెలియజేస్తోంది. గడువకు ముందే ఏయే అంశాలపై దృష్టి పెట్టాలో సూచిస్తోందని సత్య నాదెళ్ల పేర్కొన్నారు.'నా గత నెల క్యాలెండర్, ఇమెయిల్‌స్‌ను సమీక్షించి ఎక్కువ సమయం వెచ్చించిన ప్రాజెక్టులను 5 7 బకెట్లలో విభజించు' అని అడిగినప్పుడు.. వాటిన్నింటినీ సమీక్షించి ఏయే అంశంపై ఎంత సమయ వెచ్చించిందీ జీపీటీ5 చెప్తోందని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. దీంతో టైమ్ మేనేజ్‌మెంట్ సులభం అవుతోందని తెలిపారు.'గత బృంద చర్చలు, మేనేజర్‌తో జరిగిన సమావేశం ఆధారంగా నన్ను తదుపరి మీటింగ్‌కు సిద్ధం చేయి' అని అడిగినప్పుడు.. ఎంపిక చేసిన ఇమెయిల్ ఆధారంగా చర్చలన్నింటినీ జీపీటీ5 సమీక్షించి రాబోయే మీటింగ్‌కు సంబంధించిన పాయింట్లు, దానికి అవసరమైన సమాచారం అందిస్తోందని ఆయన తెలిపారు.

# ఎయిర్‌లైన్స్.. నష్టాలు డబుల్!



**ఎఫ్‌వై 2026లో రూ.10,500 కోట్ల స్థాయిలో ఉండొచ్చు**

**దేశీ విమానయాన పరిశ్రమపై ఇక్రా అంచనా**

**భౌగోళిక–రాజకీయ, వాణిజ్య ఉద్రిక్తతలే కారణం**


ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య వివాదాలు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల కారణంగా దేశీ విమానయాన రంగం నష్టాలు రెట్టింపు స్థాయిలో ఉండొచ్చని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో నష్టాలు రూ. 5,500 కోట్ల స్థాయిలో ఉండగా ఈసారి రూ. 9,500-10,500 కోట్ల స్థాయిలో ఉండొచ్చని ఒక నివేదికలో పేర్కొంది. అయితే, 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా నమోదైన రూ. 21,600 కోట్లు, రూ. 17,900 కోట్లతో పోలిస్తే తక్కువగానే ఉంటాయని వివరించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య 4-6 శాతం వృద్ధితో 17.2-17.6 కోట్లుగా నమోదు కావచ్చని ఇక్రా తెలిపింది.ఇది గతంలో వేసిన 7-10 శాతం అంచనాల కన్నా తక్కువ కావడం గమనార్హం. 'ఒకవైపు విమానాల డెలివరీలు పెరుగుతున్న తరుణంలో ప్యాసింజర్ల రద్దీ తగ్గడం వల్ల భారతీయ ఏవియేషన్ పరిశ్రమ నష్టాలు 2025 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 5,500 కోట్లతో పోలిస్తే 2026 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ. 9,500 - 10,500 కోట్లకు చేరే అవకాశం ఉంది' అని ఇక్రా వివరించింది.సీమాంతర ఉద్రిక్తతలతో సర్వీసుల్లో అంతరాయాలు, ఫ్లయిట్ల రద్దు, ఎయిరిండియా విమాన దుర్ఘటన తర్వాత విమాన ప్రయాణాలపై సందిగ్ధతలు తదితర అంశాల వల్ల తొలి త్రైమాసికంలో ప్యాసింజర్ ట్రాఫిక్ వృద్ధి 4.4 శాతానికి పరిమితమైనట్లు తెలిపింది. అలాగే, రాబడులు కూడా 4-5 శాతం తగ్గాయని వివరించింది. సుదీర్ఘ కాలం పాటు వర్షాలు కొనసాగడంతో జూలై-ఆగస్టులో కూడా విమాన ప్రయాణాలపై ప్రభావం పడి ఉంటుందని, ఇక అమెరికా టారిఫ్‌లతో తలెత్తే వాణిజ్య ఉద్రిక్తతలు సైతం రాబోయే త్రైమాసికాల్లో వ్యాపార సెంటిమెంట్లను దెబ్బతీసి, ప్రయాణాలపై పునరాలోచనలో పడే పరిస్థితి ఏర్పడవచ్చని ఇక్రా తెలిపింది. జూలైలో తగ్గిన ప్రయాణికులు.. దేశీయంగా జూలైలో విమాన ప్రయాణికుల రద్దీ 2.94 శాతం క్షీణించి 1.26 కోట్లకు పరిమితమైంది. గతేడాది జూలైలో 1.29 కోట్ల మంది దేశీ రూట్లలో ప్రయాణించారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) గణాంకాల ప్రకారం జనవరి-జూలై మధ్య కాలంలో ప్రయాణికుల సంఖ్య 9.77 కోట్లకు చేరింది. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 9.23 కోట్లతో పోలిస్తే 5.9 శాతం పెరిగింది. జూలైలో ఎయిరిండియా గ్రూప్ మార్కెట్ వాటా 26.2 శాతంగా, ఇండిగో 65.2%, ఆకాశ ఎయిర్ 5.5 శాతం, స్పైస్‌జెట్ వాటా 2 శాతంగా ఉంది. ఇండిగో అత్యధికంగా 82.15 లక్షల మందిని, ఎయిరిండియా గ్రూప్ 33.08 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చాయి.

# రెహమాన్ డప్పు... రామ్‌చరణ్ స్టెప్పు



దేశం మొత్తం వినాయక చవితి పండుగ సంబరాల్లో మునిగిపోగా రామ్‌చరణ్ మాత్రం తన సినిమా సెట్లో స్టెప్పులు వేశారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ కథానాయిక. శివరాజ్‌కుబమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం మైసూర్‌లో జరుగుతోంది. వెయ్యి మంది డ్యాన్సర్ల నేపథ్యంలో కథానాయకుడి పరిచయ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. వినాయక చవితి రోజునే చిత్రీకరణ ప్రారంభించిన చిత్రబృందం సెట్ నుంచే ఓ ప్రత్యేకమైన వీడియోను విడుదల చేస్తూ అందరికీ పండగ శుభాకాంక్షలు తెలియజేసింది. రెహమాన్ డప్పు... రామ్‌చరణ్ స్టెప్పు అదిరిపోతాయంటూ దర్శకుడు బుచ్చిబాబు సానా సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఈ చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం తెరకెక్కిస్తున్న పాటకి జానీ నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఆర్.రత్నవేలు ఛాయాగ్రాహకుడు.

# బరువు తగ్గిన కాజల్.. మెచ్చుకున్న వారిపై ఫైర్



నిజాలు చేదుగా ఉంటాయన్న సామెత ఉండనే ఉంది. అలా కొందరు వాస్తవాలను అంగీకరించలేరు కదా ప్రశంసలను కూడా స్వాగతించలేరు. నటి కాజల్ అగర్వాల్ ప్రవర్తన కూడా ఇలానే ఉంది. ఈ భామ తెలుగు, తమిళం భాషల్లో అగ్ర కథానాయికగా వెలుగొందిన విషయం తెలిసిందే. కొన్ని ఉమెన్స్ సెంట్రిక్ కథా పాత్రలో నటించినా పెద్దగా ఫలితం దక్కలేదు. అదే సమయంలో మార్కెట్ కూడా పడిపోయింది. దీంతో పెళ్లికి సిద్ధమయ్యారు. అలా 2020లో 'గౌతమ్ కిచ్లూ' అనే వ్యక్తిని వివాహమాడారు. వీరికి 'నీల్ కిచ్లూ' అనే కొడుకు ఉన్నాడు. పెళ్లి తర్వాత కొద్ది కాలమే నటనను కొనసాగించిన కాజల్ అగర్వాల్‌కు సరైన హిట్స్ అవకాశాలు రాకపోవడంతో ఖాళీగానే ఉన్నారు. అదే సమయంలో కాస్త బరువు కూడా పెరిగారు. ఈమెకు కథానాయిక అవకాశాలు రాకపోవడానికి ఇది కూడా ఒక కారణం కావచ్చు. కాజల్ అగర్వాల్ కమలహాసన్‌తో కలిసి నటించిన ఇండియన్ – 3 చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో 40 ఏళ్ల ఈ పరువాల భామ మళ్లీ నటించడానికి సిద్ధమయ్యారు. అందుకోసం గట్టిగా కసరత్తు చేసి, బరువు తగ్గి అందంగా తయారయ్యారు. దీంతో పలువురు నాలుగు పదులు వయసు దాటినా మళ్లీ సినిమాలో నటించడానికి సిద్ధమైన కాజల్ అగర్వాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఇక్కడే ఆమెకు ఆగ్రహం కట్టలు తెంచుకోవడం విశేషం. ఆమె రీఎంట్రీకి అందుతున్న శుభాకాంక్షలకు సంతోషపడకుండా 40 అని తన వయసును ప్రస్తావించడం జీర్ణించుకోలేకుంది. దీంతో 40 ఏళ్లు నిండితే అంతా ముగిసిపోయిందని అర్థం కాదనీ, అయినా ప్రతిభకు వయసు ఆటంకం కాదనీ, ఇకపై వయసు గురించి ఎవరు మాట్లాడవద్దు అని నటి కాజల్ అగర్వాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నిజాలను అంగీకరించడానికి కాజల్ అగర్వాల్ ఎందుకింత అసహనం అంటూ నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు.

# మహేశ్ బాబు మరదలు రీ ఎంట్రీ.. భయపెట్టేలా ఫస్ట్ లుక్ పోస్టర్!



టాలీవుడ్ హీరో సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ మూవీని డివోషనల్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా కూడా నటిస్తోంది. ఇప్పటికే టీజర్ రిలీజ్ కాగా..ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇందులో సోనాక్షి సిన్హా విలన్ పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రాన్ని వెంకటేశ్ కల్యాణ్- అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తుండగా.. జీ స్టూడియోస్-ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

తాజాగా ఈ మూవీకి సంబంధించిన బిగ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. మహేశ్ బాబు మరదలు శిల్పా శిరోద్కర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఆమె శోభ అనే పాత్రలో మెప్పించనుంది. తాజా పోస్టర్ చూస్తుంటే ఫుల్ అగ్రెసివ్ రోల్ చేస్తునట్లు అర్థమవుతోంది. శిల్పా శిరోద్కర్ ఇటీవలే హిందీ బిగ్‌బాస్‌లో అలరించిన సంగతి తెలిసిందే.తన పాత్ర శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ.. 'జటాధారలో భాగం కావడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇది ప్రేక్షకులను అతీంద్రియ ప్రయాణంలోకి తీసుకెళ్లే చిత్రం. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. కథ కూడా చాలా ప్రభావం చూపుతుంది. ప్రేరణ అరోరాతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. శోభ పాత్రను పోషించడం సవాల్‌తో కూడుకున్న పని. ఈ పాత్రను మనసు పెట్టి చేశా. ప్రత్యేకమైన పాత్ర పోషించడం అద్భుతంగా అనిపిస్తోంది. తెరపై నన్ను నేను చూసుకునేందుకు ఆసక్తిగా ఉన్నా' అని పంచుకుంది.


కాగా.. మహేష్ భార్య నమ్రతా శిరోద్కర్ సిస్టర్ అయిన శిల్పా శిరోద్కర్ చాలా కాలం నుంచి సినిమాలకు విరామం తీసుకుంది. ప్రస్తుతం దుబాయిలో సెటిల్ అయినా ఆమె ఈ సినిమా పాత్ర నచ్చడంతో రీ ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమాను జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, ప్రేరణా అరోరా సహకారంతో శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్ప సింగాల్ నిర్మిస్తున్నారు. అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుం అరోరా ఈ సినిమాకు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో థియేటర్స్‌లో విడుదలకానుంది.

# పవన్ కల్యాణ్ 'ఓజీ' మెలోడీ సాంగ్ విడుదల




పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ఓజీ నుంచి మరో సాంగ్ విడుదలయ్యింది. దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'సువ్వి.. సువ్వి' అంటూ సాగే ఈ మెలోడీ సాంగ్‌ను సింగర్ శృతి రంజని పాడారు. కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. ఈ పాట కోసం తమన్  మెలోడీ మ్యూజిక్‌ను అందించారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. డీవీవీ దానయ్య నిర్మాత.  శ్రియారెడ్డి, ప్రకాశ్‌రాజ్, అర్జున్‌దాస్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

# 'అఖండ 2' వాయిదా



‘అఖండ’ విజయవంతమైన చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న ‘అఖండ 2: తాండవం’ విడుదల వాయిదా పడింది. నిర్మాణానంతర పనుల కోసం అదనపు సమయం కేటాయించాల్సి రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా గురువారం నిర్మాణ సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని విడుదల చేయాలని ఇదివరకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని మరింత నాణ్యమైన రీరికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ హంగుల్ని జోడించడం కోసం సినిమా విడుదలని వాయిదా వేస్తున్నట్టు నిర్మాణ వర్గాలు తెలిపాయి. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నాయి. ‘‘ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని పంచడం కోసం  విజువల్స్ పరంగా, స్కేల్ పరంగా రాజీపడకుండా మా బృందం పనిచేస్తోంది. ‘అఖండ’కి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు దీటుగా చిత్రాన్ని మలచడంపై దృష్టి పెట్టామ’’ని నిర్మాణ వర్గాలు తెలిపాయి. యువ కథానాయకుడు ఆది పినిశెట్టి ఇందులో కీలక పాత్రని పోషిస్తున్నారు. సంగీతం: తమన్.

# నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది వారి చేతుల్లో లేదు: షమీ

ఇప్పటికే ముగ్గురు సీనియర్ క్రికెటర్లు టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఆ తర్వాత లిస్ట్‌లో వినిపిస్తోన్న పేరు మహ్మద్ షమీ. రెండేళ్ల కిందట చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడిన షమీ.. అప్పటినుంచి జట్టులో స్థానం దక్కించుకోలేదు. ఈ ఏడాది న్యూజిలాండ్‌తో వన్డే, ఇంగ్లాండ్‌పై టీ20 మ్యాచ్ ఆడిన షమీ.. గాయాలతో కుస్తీ పడుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీలో ఆడటమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నాడు. ఈక్రమంలో తన రిటైర్‌మెంట్‌పై వస్తోన్న కథనాలను కొట్టిపడేశాడు. ఎవరి చేతుల్లోనూ వీడ్కోలు నిర్ణయం లేదని.. ఆటపై విసుగు వచ్చేవరకూ కొనసాగుతానని స్పష్టం చేశాడు.

"ఎవరికైనా సమస్య ఉంటే.. నేను రిటైర్‌మెంట్ తీసుకుంటే వారి జీవితాలు బాగుంటాయని నాతోనే చెప్పండి. అప్పుడు ఆలోచిద్దాం. నేను ఆటకు వీడ్కోలు పలకాలని కోరుకొనేంతగా ఎవరికైనా సమస్యగా మారానా చెప్పండి. నేను ఎప్పుడైతే ఆటపై విసుగు చెందుతానో.. అప్పుడు వదిలేస్తా. అంతేకానీ, మీరు (విమర్శకులు) నిర్ణయం తీసుకోవద్దు. నేను ఇప్పటికీ కష్టపడుతున్నా. ఒకవేళ అంతర్జాతీయ క్రికెట్‌కు ఎంపిక చేయకపోతే.. దేశవాళీలో ఆడతా. ఎక్కడైనా ఆడేందుకు సిద్ధంగానే ఉంటా. మీకు బోర్ కొట్టినప్పుడల్లా ఇలాంటి వాటి గురించి ఆలోచించండి. నాకు అంత సమయం లేదు" అని వ్యాఖ్యానించాడు.

ఇప్పుడు చాలా బాగున్నా..

"గత రెండు నెలల్లో నా ఫిట్‌నెస్ చాలా మెరుగుపర్చుకున్నా. నా నైపుణ్యాలకూ పదునుపెట్టా. బరువును అదుపులోకి తెచ్చుకున్నా. సుదీర్ఘంగా స్పెల్స్ వేయడం పైనే దృష్టిపెడుతున్నా. ఒక్కసారి రిథమ్‌ను అందుకొంటే చాలు. ఇందుకోసం బ్యాటింగ్, ఫీల్డింగ్ విషయంలోనూ కఠినంగా ప్రాక్టీస్ చేశా. ఇప్పుడైతే ప్రతిదాంట్లో కంఫర్ట్‌గా ఉన్నా. నాకు ఇప్పటికీ వన్డే వరల్డ్ కప్‌ను సగర్వంగా ఎత్తుకోవాలనేది కల. ఆ జట్టులో సభ్యుడిగా ఉండాలని ఉంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరాం. వరుసగా విజయాలు సాధించి అక్కడికి వెళ్లాం. అయితే, అక్కడ కాస్త ఆందోళన పడ్డాం. అభిమానులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఫైనల్‌లోకి అడుగుపెట్టాం. కానీ, ఆ రోజు మాకు కాస్త అదృష్టం కలిసి వచ్చిఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. ఛాంపియన్‌గా నిలిచేవాళ్లం" అని షమీ గుర్తు చేసుకున్నాడు.



# ప్రపంచకప్ బెర్తుపై భారత్ గురి


**నేటి నుంచే ఆసియా కప్ హాకీ**

**భారత్ × చైనా మ|| 3 నుంచి**

రాజ్‌గిర్ (బిహార్): మూడుసార్లు ఛాంపియన్ భారత్.. ఆసియా కప్ హాకీ టోర్నీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ టోర్నీలో టైటిల్ సాధించాలని భారత్ పట్టుదలగా ఉంది. ఆసియా కప్ సొంతం చేసుకున్న జట్టుకు వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌నకు బెర్తు ఖాయం అవుతుంది. శుక్రవారం తొలి మ్యాచ్‌లో భారత్.. చైనాను ఢీకొనబోతోంది. పూల్‌ఎలో భారత్, చైనాలతో పాటు జపాన్, కజకిస్థాన్ ఉన్నాయి. పూల్‌బి జట్లు.. దక్షిణ కొరియా, మలేసియా, బంగ్లాదేశ్, చైనీస్ తైపీ. ఐరోపా పర్యటనలో పేలవ ప్రదర్శన చేసిన భారత్.. ఆసియా కప్‌లో స్థాయికి తగ్గట్లు ఆడాలని చూస్తోంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం సరిహద్దు ఉద్రిక్తల నేపథ్యంలో భద్రత కారణాలను చూపి పాకిస్థాన్ ఈ టోర్నీకి దూరంగా ఉంది. రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబరు 7న ఫైనల్ జరుగుతుంది. దిగ్గజ హాకీ ప్లేయర్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం రోజు ఆసియా కప్ హాకీ భారత్‌లో ఆరంభమవనుండటం విశేషం.



# సింధు సంచలనం



**ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యిపై గెలుపు**

**క్వార్టర్ ఫైనల్లోకి భారత స్టార్ షట్లర్**

**డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ ముందంజ**

పారిస్: సత్తాకు సవాల్‌గా నిలిచిన మ్యాచ్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు తన ప్రతాపాన్ని చూపించింది. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా సాధికారిక ఆటతీరుతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. తద్వారా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 21-19, 21-15తో గెలిచింది. 48 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్ లో సింధు రెండు గేముల్లోనూ నిలకడగా ఆడింది.

గతంలో వాంగ్ జి యిపై రెండుసార్లు గెలిచి, రెండుసార్లు ఓడిపోయిన సింధు ఐదో ప్రయత్నంలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. తొలి గేమ్‌లో ఒకదశలో 6-2తో ముందంజ వేసిన సింధు... ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని 11-6కు పెంచుకుంది. ఈ దశలో వాంగ్ జి యి వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి 12-11తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత వాంగ్ జి యి 19-17తో తొలి గేమ్ సొంతం చేసుకునేందుకు రెండు పాయింట్ల దూరంలో నిలిచింది. అయితే సింధు ఆందోళన చెందకుండా, తన అనుభవాన్నంత రంగరించి ఆడి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి తొలి గేమ్‌ను 21-19తో దక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలో ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. స్కోరు 6-6 వద్ద సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు సాధించి 11-6తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం వాంగ్ జి యి తేరుకొని ఆధిక్యం అంతరం ఒక పాయింట్‌కు తగ్గించింది. స్కోరు 12-11 వద్ద సింధు మళ్లీ విజృంభించి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 16-11తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న సింధు విజయాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో తొమ్మిదో ర్యాంకర్ పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా)తో సింధు ఆడుతుంది.

పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ సాత్విక్-చిరాగ్ ద్వయం 19-21, 21-15, 21-17తో ప్రపంచ ఆరో ర్యాంక్ లియాంగ్ వె కెంగ్-వాంగ్ చాంగ్ (చైనా) జోడీని బోల్తా కొట్టించింది.

మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో (భారత్) జోడీ కూడా సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఐదో ర్యాంక్ జంట టాంగ్ చున్ మాన్-సెయింగ్ సుయెట్ (హాంకాంగ్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ధ్రువ్-తనీషా జోడీ 19-21, 21-12, 21-15తో గెలిచింది.

ప్రణయ్‌కు నిరాశ

పురుషుల సింగిల్స్ విభాగంలో 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, భారత స్టార్ ప్రణయ్ పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో ప్రపంచ 34వ ర్యాంకర్ ప్రణయ్ 8-21, 21-17, 21-23తో ప్రపంచ రెండో ర్యాంకర్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్ లో ప్రణయ్ మూడు మ్యాచ్ పాయింట్లు చేజార్చుకోవడం గమనార్హం.

# గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్లో ప్రజ్ఞానందజ్ఞానంద

సెయింట్ లూయిస్ (అమెరికా): భారత చెస్ స్టార్ ప్రజ్ఞానంద గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. సింక్వెఫీల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలవడం ద్వారా అతడు.. ఈ బెర్తు దక్కించుకున్నాడు. ఆఖరిదైన తొమ్మిదో రౌండ్లో లెవోన్ అరోనియన్ (అమెరికా)తో డ్రా చేసుకున్న ప్రజ్ఞానంద 5.5 పాయింట్లతో కరువానా (అమెరికా), వెస్లీ సో (అమెరికా)తో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచాడు. ముక్కోణపు టైబ్రేక్‌లో కరువానాపై ప్రజ్ఞానంద గెలవగా.. ప్రజ్ఞానంద, కరువానాలను వెస్లీ ఓడించాడు. దీంతో వెస్లీ టైటిల్ నెగ్గగా.. ప్రజ్ఞానంద రన్నరప్ అయ్యాడు. ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ (4) ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా ఈ ఏడాది అయిదు టోర్నీలు జరిగాయి. సింక్వెఫీల్డ్ కప్ ఇందులో చివరిది. మొత్తంగా టాప్4 ప్లేయర్లు ఈ ఫైనల్ ఈవెంట్‌కు అర్హత సాధిస్తారు. ప్రజ్ఞానంద (30 పాయింట్లు), లాగ్రెవ్ (33, ఫ్రాన్స్), కరువానా (30.5), అరోనియన్ (30.5) ఈ టోర్నీలో ఆడబోతున్నారు. సెప్టెంబర్ 26న సావోపాలోలో ఈ పోటీలు ఆరంభం కానున్నాయి. నేరుగా సెమీస్ నుంచి ప్రారంభమయ్యే ఫైనల్ సమరంలో లాగ్రెవ్‌తో ప్రజ్ఞానంద.. కరువానాతో అరోనియన్ తలపడతారు.



# అజయ్ బాబుకు స్వర్ణ పతకం

అహ్మదాబాద్: కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్లు వల్లూరి అజయ్ బాబు, బేద్‌బ్రత్ భరాలి బంగారు పతకాలు సాధించారు. గురువారం జరిగిన సీనియర్ పురుషుల 79 కేజీల కేటగిరీలో జాతీయ క్రీడల చాంపియన్ అయిన అజయ్ బాబు మొత్తం 335 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు. స్నాచ్‌లో 152 కేజీల బరువెత్తి కామన్వెల్త్ చాంపియన్‌షిప్ రికార్డును కూడా నెలకొల్పాడు. క్లీన్ అండ్ జెర్క్‌లో 183 కేజీలు ఎత్తాడు. స్నాచ్‌లో ఇంతకుముందు నైజీరియాకు చెందిన ఎడిడివోంగ్ జోసెఫ్ 147 కేజీల రికార్డును అజయ్ తిరగరాశాడు. గత క్రీడల్లోనూ అతను బంగారు పతకం సాధించినప్పటికీ అప్పుడు 81 కేజీల విభాగంలో పోటీపడ్డాడు. సీనియర్ మహిళల 69 కేజీల కేటగిరీలో కామన్వెల్త్ క్రీడల (2022) కాంస్య పతక విజేత హర్జిందర్ కౌర్ మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. జూనియర్ పురుషుల 79 కేజీల విభాగంలో బేదబ్రత్ భరాలి స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌లో కొత్త రికార్డులతో పసిడి పట్టాడు. అతను స్నాచ్‌లో 145 కేజీల బరువెత్తాడు. తద్వారా 139 కేజీల గత రికార్డును అధిగమించాడు. అలాగే క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కేజీల బరువెత్తి 169 కేజీల గత రికార్డును తుడిచిపెట్టాడు. మొత్తంగా బేదబ్రత్ 326 కేజీల బరువెత్తాడు. యూత్ మహిళల 77 కేజీల విభాగంలో గ్రీష్మ తోరట్ రజతం నెగ్గింది.



# సబలెంకా ముందుకు...



**మూడో రౌండ్‌లోకి మహిళల సింగిల్స్ డిఫెండింగ్ చాంపియన్**


**శ్రమించి గెలిచిన రెండో సీడ్ స్వియాటెక్**

**అల్‌కరాజ్, జొకోవిచ్ జోరు**

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ సబలెంకా 7-6 (7/4), 6-2తో పొలీనా కుదెర్‌మెటోవా (రష్యా)పై విజయం సాధించింది. 96 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఐదు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నెట్ వద్దకు నాలుగుసార్లు దూసుకొచ్చి రెండుసార్లు పాయింట్లు గెలిచింది. 18 విన్నర్స్ కొట్టిన ఆమె 22 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన ఈ బెలారస్ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), మాజీ చాంపియన్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్), ఏడో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ) కూడా మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. సుజాన్ లామెన్స్ (నెదర్లాండ్స్)తో 2 గంటల 6 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో స్వియాటెక్ 6-1, 4-6, 6-4తో కష్టపడి గెలిచింది. పెగూలా 6-1, 6-3తో బ్లింకోవా (రష్యా)పై, రాడుకాను 6-2, 6-1తో జానైస్ జెన్ (ఇండోనేసియా)పై, పావోలిని 6-3, 6-3తో ఇవా జోవిక్ (అమెరికా)పై విజయం సాధించారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా) 6-1, 6-3తో పొటపోవా (రష్యా)పై, పదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా) 6-2, 6-1తో మెక్‌నాలీ (అమెరికా)పై, తొమ్మిదో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6-3, 7-6 (9/7)తో తెరెజా వాలెన్‌టోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొంది మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో 16వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) 3-6, 3-6తో ఆన్ లీ (అమెరికా) చేతిలో, 17వ సీడ్ సమ్సోనోవా (రష్యా) 6-4, 3-6, 2-6తో ప్రిసిల్లా హాన్ (ఆస్ట్రేలియా) చేతిలో, 25వ సీడ్ జెలెనా ఒస్టాపెంకో (లాత్వియా) 5-7, 1-6తో టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా) చేతిలో ఓడిపోయారు.

11వ సీడ్ రూనె ఓటమి పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్), మాజీ విజేత జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించగా... 11వ సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్ 6-1, 6-0, 6-3తో మటియా బెలూచి (ఇటలీ)పై, జొకోవిచ్ 6-7 (5/7), 6-3, 6-3, 6-1తో జచారీ వజ్డా (అమెరికా)పై గెలుపొందారు. రూనె 6-7 (5/7), 6-2, 3-6, 6-4, 5-7తో జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 4-6, 7-6 (7/3), 6-2, 6-4తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)పై, ఆరో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) 6-4, 6-2, 6-4తో కరెనో బుస్టా (స్పెయిన్)పై, పదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6-4, 6-0, 6-2తో డేవిడ్ గాఫిన్ (బెల్జియం)పై విజయం సాధించారు.

# నీరజ్‌కు రెండో స్థానం







జ్యూరిచ్: డైమండ్ లీగ్ ఫైనల్స్ జావెలిన్ త్రో ఈవెంట్లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా రెండో స్థానం సాధించాడు. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన పోటీలో అతను అంచనాల మేర రాణించకపోయినప్పటికీ.. ఆఖర్లో సత్తా చాటి ఈవెంట్‌ను మెరుగ్గా ముగించాడు. నీరజ్ తన చివరి ప్రయత్నంలో అత్యుత్తమంగా 85.01 మీటర్లు బల్లేన్ని విసిరాడు. జర్మనీ క్రీడాకారుడు జులియన్ వెబర్ 91.51 మీటర్లతో అగ్రస్థానం సాధించాడు. అతడికిదే ఉత్తమ ప్రదర్శన. వెబర్ రెండుసార్లు 90 మీటర్లకు పైగా బల్లేన్ని విసరడం విశేషం. కెషార్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టుబాగో) 84.95 మీటర్లతో మూడో స్థానంలో నిలిచాడు. కొన్ని నెలల కిందటే కెరీర్లో తొలిసారి 90 మీటర్ల మార్కును అందుకున్న నీరజ్.. జ్యూరిచ్‌లో తన ఉత్తమ ప్రదర్శనకు చాలా దూరంలో ఆగిపోయాడు. తొలి ప్రయత్నంలో 84.35 మీటర్ల ప్రదర్శన తర్వాత రెండోసారి 82 మీటర్లే బల్లేన్ని విసిరిన నీరజ్.. వరుసగా మూడు ఫౌల్స్ చేశాడు. అప్పటికి వాల్కాటే రెండో స్థానంలో ఉన్నాడు. కానీ ఆఖరి ప్రయత్నంలో నీరజ్.. వాల్కాట్‌ను అధిగమించాడు.

# ఐపీఎల్ చరిత్రలో అతి భారీ రికార్డు అశ్విన్ ఖాతాలోనే..!

భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ నిన్న (ఆగస్ట్ 27) ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రికెట్ జీనియస్ క్యాష్ రిచ్ లీగ్ నుంచి తప్పుకున్న నేపథ్యంలో అతని పేరిట ఓ భారీ ఐపీఎల్ రికార్డు తెరపైకి వచ్చింది. అదేంటంటే.. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక బంతులు వేసిన రికార్డు .2009లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన అశ్విన్.. తన 221 మ్యాచ్‌ల కెరీర్‌లో 4710 బంతులు వేశాడు. ఐపీఎల్‌లో ఓ బౌలర్ వేసిన అత్యధిక బంతులు ఇవే. అశ్విన్ తర్వాత ఐపీఎల్‌లో అత్యధిక బంతులు వేసిన ఘనత సునీల్ నరైన్‌కు దక్కుతుంది. నరైన్ తన ఐపీఎల్ కెరీర్‌లో 4345 బంతులు సంధించాడు. ఈ విభాగంలో అశ్విన్, నరైన్ తర్వాతి స్థానాల్లో భువనేశ్వర్ కుమార్ (4222), రవీంద్ర జడేజా (4056) ఉన్నారు.37 ఏళ్ల అశ్విన్ చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసి, 2025 సీజన్‌లో అదే ఫ్రాంచైజీ తరపున తన చివరి మ్యాచ్ ఆడాడు. ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 221 మ్యాచ్‌లు ఆడిన అతను 187 వికెట్లు తీశాడు. అలాగే ఓ హాఫ్ సెంచరీ సాయంతో 833 పరుగులు చేశాడు. సీఎస్‌కే తరపున రెండు టైటిళ్లు (2010, 2011) సాధించిన అశ్విన్.. రైజింగ్ పూణే, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్ వంటి జట్లకు సేవలందించారు. రెండు సీజన్లలో (2018, 2019) పంజాబ్‌కు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. 16 సీజన్ల పాటు ఐపీఎల్‌లో తన మాయాజాలాన్ని ప్రదర్శించిన అశ్విన్.. త్వరలో విదేశీ లీగ్‌ల్లో పాల్గొంటాడని తెలుస్తుంది.ఐపీఎల్‌లో అశ్విన్ పేరిట ఉన్న ప్రత్యేకమైన రికార్డులు

ఐదో అత్యధిక వికెట్లు (187)

సీఎస్‌కే తరపున మూడో అత్యధిక వికెట్లు (97)

ఐపీఎల్‌లో కెప్టెన్‌గా ఐదో అత్యధిక వికెట్లు (25)

ఐపీఎల్ చరిత్రలో మూడో అత్యధిక డాట్ బాల్స్ (1663)

ఐపీఎల్ చరిత్రలో అత్యధిక బాల్స్ (4710)

ఇతర గుర్తించదగిన ఘట్టాలు

2011 ఎడిషన్ ఫైనల్లో క్రిస్ గేల్‌ను డకౌట్ చేయడం

2019 ఎడిషన్‌లో జోస్ బట్లర్‌ను మన్కడింగ్ చేయడం

ఐపీఎల్‌లో రిటైర్డ్ ఔటైన తొలి ఆటగాడు (2022 ఎడిషన్‌లో)

